

ఫోరెన్సిక్ విభాగంలో సరికొత్త విధానం

» సౌత్ ఇండియా మెడికో లీగల్ అసోసియేషన్(సిమ్లా) కార్యక్రమంలో ఏలూరు రేంజ్ ఐజీ

వరద వణుకు



ఏలేరు ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న వరద నీరు

- జిల్లావ్యాప్తంగా భారీగా కురుస్తోన్న వర్షాలు.. రోజంతా వానేవాన
- అత్యధికంగా కరపలో 9.6సెం.మీ. వర్షపాతం
- ఎక్కడికక్కడ లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం: ఇళ్లల్లోకి వాన నీరు
- కాకినాడ నగరం జలమయం: రెండుగంటల వ్యవధిలో 4.8సెం.మీ. వర్షం
- ఏలేరు రిజర్వాయరుకు మళ్లీ భారీగా పెరుగుతున్న వరద
- రిజర్వాయర్ నుంచి 5,350 క్యూసెక్కుల మిగులు జలాలు విడుదల
- నేడు 12వేల క్యూసెక్కుల వరకు వరద నీరు విడుదల చేసే ప్రమాదం
- కాలువలకు వరద పెరగడంతో మళ్లీ మునుగుతున్న పంటలు
- గండ్లు పూడ్చకపోవడంతో పరివాహక గ్రామాల్లో భయంభయం
- అప్రమత్తంగా ఉండాలని ఏలేరు పరివాహక మండలాల అధికారులకు ఆదేశం

పిఠాపురంలో జోరుగా వర్షం కురుస్తున్న దృశ్యం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/పిఠాపురం/ఏలేశ్వరం: తగ్గినట్టే తగ్గి జిల్లాలో మళ్లీ వర్షాలు భారీగా కురుస్తున్నాయి. మొన్నటివరకు ఎడతెరిపి లేకుండా వానలు, మరోపక్క వరదతో జిల్లా కొన్నిరోజులుగా ఉక్కిరిబిక్కిరి అయింది. వరుస వర్షాలతో తేరుకోవడానికి నానా ఇబ్బంది పడింది. అదే సమయంలో ఏలేరుకు అత్యంత భారీస్థాయిలో వరద రావడంతో ఏకంగా ఎనిమిది మండలాలు వణికిపోయాయి. వేలాది ఎకరాల పంటలు, వందలాది కుటుంబాలు ఇబ్బంది పడ్డాయి. క్రమేపీ ఆ ఇబ్బందుల నుంచి బయటపడుతున్నాం.. అనుకునేలోగా మళ్లీ వర్షాలు భారీగా దంచి కొడుతుండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఐదు సెంటీమీటర్లకు మించి వర్షపాతం

శుక్రవారం జిల్లాలో అనేక చోట్ల ఐదు సెంటీమీటర్లకు మించి వర్షపాతం నమోదైంది. కరప మండలంలో అయితే ఏకంగా రాష్ట్రంలోనే అత్యధికంగా 9.6సెంటీమీటర్లు వాన కురిసింది. ఎగువన వర్షాలతో ఏలేరుకు సైతం మళ్లీ వరద పోటెత్తుతోంది. దీంతో శుక్రవారం రాత్రి దిగువకు వరదను విడిచిపెట్టడంతో మళ్లీ గ్రామాలకు ముంపు ముప్పు ఏర్పడింది. కాలువలకు పడ్డ గండ్లు ఇంకా పూడ్చకపోవడంతో మళ్లీ వేలాది ఎకరాలను వరద ముంచేసే పరిస్థితి తలెత్తింది. వర్షాలకు గండేపల్లిమండలంలో రెండు పెంకుటిళ్లు కూలిపోయాయి.

ఎడతెరిపి లేకుండానే..

జిల్లావ్యాప్తంగా రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ముసురు వాతావరణం ఏర్పడింది. ఈనెల మూడో వారంలో వర్షాల తర్వాత రెండు రోజులు భారీగా ఎండలు మండిపోయాయి. కానీ మళ్లీ రెండురోజులుగా జిల్లాలో ఎక్కడికక్కడ వానలు దంచికొడుతున్నాయి. కుంభవృష్టిగా కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. సామర్లకోట బస్టాండ్ గురువారం పూర్తిగా మోకాల్లోతు నీటిలో మునిగిపోయింది. కాకినాడ ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లోను వాన నీరు నిలిచిపోయింది. ప్రత్తిపాడు, జగ్గంపేట, తుని నియోజకవర్గాల్లోను ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తుండడంతో ఎక్కడికక్కడ పంట చేలల్లోకి క్రమేపీ నీరు వస్తోంది. శుక్రవారం తెల్లవారుజామునుంచయితే వర్షం తీవ్రత మరింత పెరిగి కుంభవృష్టిగా కురిసింది.

కాకినాడలో ఏకధాటిగా..

జిల్లా కేంద్రం కాకినాడలో ఉదయం తొమ్మిది నుంచి ఏకధాటిగా రెండు గంటలపాటు వాన కురిసింది. దీంతో ఏకంగా 4.8సెంటీమీటర్లు నమోదైంది. మెయిన్‌రోడ్డు, సినిమారోడ్డుతోపాటు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమైపోయాయి. కాకినాడరూరల్ నియోజకవర్గం కరపలో ఏకంగా 9.6సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధిక వర్షం ఇక్కడే కురిసింది. పెదపూడి మండలంలో 8, కాజులూరు 5, ఇతర మండలాల్లో 4.4 నుంచి 2.1 సెంటీమీటర్ల వరకు వర్షం కురిసింది. దీంతో అనేక ప్రాంతాల్లో వాన తీవ్రతకు రహదారులపై నీరు చేరి జనం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గుంతల రహదారుల్లో నీరు చేరడంతో రాత్రి వేళల్లో ప్రయాణించే వారికి నరకం కనిపిస్తోంది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు గండేపల్లిలో రెండు పెం కుటిళ్ల నేలకూలాయి.

మళ్లీ వరద భయం

ఎగువన మళ్లీ భారీ వర్షాలు కురుస్తుండడం తో ఏలేరు ప్రాజెక్టుకు మళ్లీ పెద్దఎత్తున వరద పెరుగుతోంది. దీంతో కాలువ పరివాహక ప్రాంతాల రైతులు, ప్రజల్లో భయాందోళనలు పెరుగుతున్నాయి. ఇటీవల 46వేల క్యుసెక్కులకు పైగా వరద ప్రాజెక్టుకు పోటెత్తడంతో మొత్తం నీటిని కాలువల్లోకి వదిలేశారు. దీంతో వరద విలయం ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం, పిఠాపురం నియోజకవర్గాల్లో 8మండలాలను పూర్తిగా ముంచేసింది. ఏకంగా గొల్లప్రోలు హైవేతోపాటు పిఠాపురం శివార్లలో అనేక గ్రామాల్లోకి వరద వచ్చేసింది. ఇటీవల వరద తగ్గడంతో పొలాల్లో చేరిన నీరు వెనక్కు తగ్గుతోంది. వరద బాధితులు కూడా ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ఈ తరుణంలో క్యాచ్‌మెంట్ ఏరియాకు వరద పెరగడంతో మళ్లీ పరివాహక ప్రాంతానికి భారీ ముప్పు పొంచి ఉంది. రిజర్వాయర్ నుంచి ప్రస్తుతం 5,350 క్యూసెక్కుల మిగులు జలాలను కాలువలకు విడుదల చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో భారీ వర్షాలతో భారీగా ఇన్‌ఫ్లో పెరుగుతుండడంతో 12వేల క్యూసెక్కుల వరకూ వరదకు రావచ్చని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రిజర్వాయర్ నిండిపోవడంతో వరద నీటిని వచ్చినట్లు విడుదల చేసే అవకాశం ఉంది. ఇదే జరిగితే అక్కడక్కడ మిగిలిన వరి తదితర పంటలను రైతులు పూర్తిగా కోల్పోయే ప్రమాదముంది. సెప్టెంబరు రెండో వారంలో వచ్చిన వరదలకు ఏలేరు పంటకాలువలకు 200కిపైగా ప్రాంతాల్లో చిన్న, పెద్దగండ్లు పడ్డాయి. ఇందులో మూడు, నాలుగు చోట్ల మాత్రమే అత్యవసరంగా పూడ్చారు. మిగిలిన వాటిని వదిలివేశారు. ఇప్పుడు వరద నీరు 6వేల క్యూసెక్కులు దాటితే గండ్లు నుంచి వరద నీరు పంటపొలాల్లోకి చేరుతోంది.

ఏలేరులో ప్రాజెక్టులో ఇది పరిస్థితి

ప్రస్తుతం అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఏజెన్సీలో కురుస్తున్న భారీవర్షాలతో ఏలేరు ప్రాజెక్టుకు ఒక్కరోజు వ్యవధిలో ఇన్‌ఫ్లో రెట్టింపయింది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 4,814 క్యూసెక్కులుగా ఉండడంతో రిజర్వాయర్ రెండు గేట్ల ద్వారా 5,350 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇందులో కాలువలకు 4,500, డీసీఆర్ స్లూయిస్ ద్వారా 600, విశాఖ తాగునీటి అవసరాలకు 250 క్యూసెక్కుల నీటిని పంపుతున్నారు. వాస్తవానికి ఏలేరు రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 86.56మీటర్లు కాగా, ప్రస్తుతం రిజర్వాయర్ నీటిమట్టం 85.64 మీటర్లు ఉంది. అయితే శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు 5,350క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా దీన్ని శనివారం నాటికి 12వేల క్యూసెక్కుల వరకూ పెంచే అవకాశం ఉంది. దీంతో కిర్లంపూడి, జగ్గంపేట, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి, సామర్లకోట, పెద్దాపురం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఏలేరుకు మళ్లీ వరదతో ఆయకట్టు ప్రాంతాల్లో అక్కడక్కడ మిగిలిఉన్న వరి, ఇతర పంటలు పూర్తిగా కోల్పోతామని రైతులు కలవరపడుతున్నారు.

లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయం

పిఠాపురం/గొల్లప్రోలు/కరప/ప్రత్తిపాడు/కిర్లంపూడి/ఏలేశ్వరం/కొత్తపల్లి/తుని రూరల్, సెప్టెంబరు 27: కాకినాడ, పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలు, కరప, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, జగ్గంపేట, కొత్తపల్లి, తునిల్లో శుక్రవారం మధ్యాహ్నం భారీవర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. కరపలో భారీ వర్షానికి ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వేళంగి ప్రధాన రహదారిపై మోకాళ్లలోతు నీరు చేరింది. కరప-కొరుపల్లి రహదారి, ఎంపీడీవో కార్యాలయం, పలు ప్రభుత్వ పాఠశాలలు, ఎంఈవో కార్యాలయం జలమయమయ్యాయి. ప్రత్తిపాడు మండలంలోని ఈ.గోకవరం వద్ద గల మధ్య తరహా సాగునీటి జలాశయం సుబ్బారెడ్డిసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తింది. శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్టులో గరిష్ఠ స్థాయి నీటి మట్టం 87.20మీటర్ల స్థాయికి మించి వరద నీరు వచ్చి చేరింది. వర్షాలకు ఏలేరు ప్రాజెక్టు దిగువకు విడుదల చేస్తుండడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో కిర్లంపూడిలో రైతులు ఆందోళన చేస్తున్నారు. ఏలేశ్వరం పట్టణంలోని పలు వీధుల్లో రోడ్లన్నీ గుంతలతో చెరువులను తలపిస్తున్నాయి. వర్షానికి కొత్తపల్లి మండలం కోనపాపపేట నుంచి ఉప్పాడ వరకు ఉన్న తీరప్రాంతాల మత్స్యకారులు శుక్రవారం కూడా వేట విరమించారు. వర్షాలతో తాండవ జలాశయానికి నీరు పోటెత్తడంతో రిజర్వాయర్ గేట్లు ఎత్తేందుకు అధికారులు సిద్ధమయ్యారు.



కిర్లంపూడి మండలం ముక్కోలు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఏలేరు కాలువ



కాకినాడ నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట వర్షానికి నీటమునిగిన రహదారి



కరప మండలం వేళంగిలో భారీవర్షానికి చెరువులా మారిన ప్రధాన రహదారి

మద్యం నిల్



కాకినాడలో ఖాళీగా దర్శనమిస్తున్న మద్యం షాపు

- దుకాణాల్లో చాలావరకు ఖాళీ
- డిపోల నుంచి నిలిచిపోయిన సరఫరా
- ఇప్పటివరకు ఉన్న నిల్వలను అమ్మేయాలని ఆదేశాలు
- ఖరీదైన లిక్కరే అందుబాటులో.. బార్లకు జనం బారులు

పెద్దాపురం, సెప్టెంబరు 27: జిల్లాలో మద్యం కొరత ఏర్పడింది. దీంతో మందుబాబులకు మద్యం దొరక్క ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఎక్సైజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా మల్టీనేషనల్ మద్యాన్ని అన్ని షాపుల్లో అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించారు. ఆ తర్వాత నుంచి మద్యం కొరత ఏర్పడింది. ఈనెల 20న ప్రకటన చేయడంతో బ్రాండ్లు రావడం మాట అటుంచి చాలావరకూ దుకాణాల్లో ఉన్న బ్రాండ్లు కూడా కనిపించకుండా పోయాయి. ముఖ్యంగా పేదలకు అందుబాటులో ఉండే మద్యం బ్రాండ్లు అసలు దొరకడలేదు. దీంతో మందుబాబులు గగ్గోలు పెడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఖరీదైన మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. క్వార్టర్‌కు రూ.200 పెట్టడమే ఎక్కువని మందుబాబులు లబోదిబోమంటుంటే రూ.600 పైబడి ఉన్న ధరలున్న బ్రాండ్లు మాత్రమే విక్రయిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ఏర్పడిన మద్యం కొరత కారణంగా వినియోగదారుల జేబుకు చిల్లు పడడంతోపాటు ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడుతోంది. చాలాచోట్ల అతి తక్కువ బ్రాండ్లు మాత్రమే దుకాణాల్లో ఉండడంతో విక్రయాలు పడిపోతున్నాయి.

కొత్తపాలసీ కారణంగా చూపించి..

ప్రస్తుతం అమలులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల పాలసీని ఎత్తివేసి కొత్త పాలసీ తెస్తోంది. ఇప్పటికే దీని విధివిధానాలను కూటమి ప్రభుత్వం ప్రకటించింది కూడా.. కాకినాడ జిల్లాలో ప్రస్తుతం 154 మద్యం దుకాణాలు ఉన్నాయి. కొత్త పాలసీపై నోటిఫికేషన్ కూడా త్వరలో రానుంది. వచ్చే నెల మొదటి వారానికి నూతన మద్యం విధానం అమలులోకి రానున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత నుంచి ప్రభుత్వ దుకాణాలు ఇక ఉండవు. ఈలోపులో ఉన్న స్టాకు మాత్రమే విక్రయించాలని అధికారులు దుకాణాల్లోని సిబ్బందిని ఆదేశిస్తున్నారు. దీంతో మద్యం డిపోల నుంచి దుకాణాలకు మద్యం సరఫరా నిలిచిపోయింది. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాలు మందు కొరత కారణంగా వెలవెలబోతున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో మద్యం దుకాణాలు మందుబాబులు లేక దాదాపు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

ఖరీదైన లిక్కరే అందుబాటులో..

మద్యం దుకాణాల్లో తమకు నచ్చిన బ్రాండ్లు దొక్కపోవడంతో వినియోగదారులు బార్లకు వెళ్తున్నారు. నిబంధనల ప్రకారం బార్లలో కేవలం రెస్టారెంట్‌లోనే మందును సర్వ్ చేయాలి. కానీ అందుకు విరుద్ధంగా చాలాచోట్ల బార్ల యాజమాన్యాలు బాటిళ్లను బయటకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం మద్యం దుకాణాల్లో బ్రాండ్లు లేకపోవడంతో బార్లకు లాభం చేకూరుతోంది. బార్లలో ఒక క్వార్టర్‌పైనే రూ.50 నుంచి రూ.80 అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త మద్యం పాలసీని చూపించి ముందుగానే ఉన్న స్టాకును ఖాళీ చేసేస్తే ప్రభుత్వ దుకాణాల్లోలెక్కలు సులభంగా ఉంటాయని మిగిలిన స్టాకును వెనక్కి తీసుకువెళ్లడం కష్టమని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా..

ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు మద్యం అమ్మకాలపై నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. బదిలీలు, కొత్తపాలసీలపై దృష్టిసారించి ఉన్న పాలసీని గాలికొదిలేశారు. కేవలం ప్రకటనలు చేయడమే తప్ప కొత్త పాలసీ వచ్చేలోగా ఉన్న పాలసీతో పనిలేదు అన్నట్లు వ్యవహరించడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అమ్మకాలు తగ్గిపోవడంతో ఆదాయం పడిపోయే అవకాశం ఉంది. అధికారుల తీరు కారణంగా ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయం పక్కదారి పడుతోందని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టెట్ పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలి: జేసీ



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 27: విద్యాశాఖ నిర్వహిస్తున్న టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్-2024కు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జేసీ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్-2024కు సంబంధించిన ఏర్పాట్లపై రెవెన్యూ, పాఠశాల విద్యాశాఖ, పోలీస్, వైద్యఆరోగ్యం తదితర శాఖలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అక్టోబరు 3 నుంచి 21 వరకు ఉపాధ్యాయ అర్హత పరీక్షను రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిమిత్తం జిల్లాలో నాలుగు కంప్యూటర్ సెంటర్లలో ఈపరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి 12గంటల వరకు.. మధ్యాహ్నం 2.30 నిమిషాల నుంచి 5 గంటల వరకు రెండు సెషన్స్‌లో జరిగే టెట్‌పరీక్షలకు 21471 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ పరీక్ష నిమిత్తం నలుగురు విద్యాశాఖ అధికారులు, నలుగురు డిపార్ట్మెంట్ అధికారులను నియమించామని, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిని నియమించామని తెలిపారు. 27మంది స్క్రయిబ్‌లను నియమించామన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి లేటెస్ట్ ఫొటో గుర్తింపుకార్డుతో అభ్యర్థులు తప్పక హాజరకావాలన్నారు. విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, పాఠశాల విద్య, వైద్య ఆరోగ్యం, ప్రజారవాణా, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన కాకినాడ సబ్ రిజిస్ట్రార్‌లు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 27: కాకినాడ అర్బన్ పరిధిలో నియమితులైన సబ్‌రిజిస్ట్రార్‌లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు కాకినాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్-1గా ఆర్‌వీ రామారావు, సబ్ రిజిస్ట్రార్-2గా పీఎస్‌వీఎస్ఎస్ భద్రరావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్‌లకు కార్యాలయ సిబ్బంది, దస్తావేజు లేఖర్లు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

పర్యాటకశాఖ పార్లమెంటరీ కమిటీ సభ్యుడిగా కాకినాడ ఎంపీ నియామకం



కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 27: రవాణా, సంస్కృతి, పర్యాటకశాఖ పార్లమెంటరీ కమిటీ సభ్యుడిగా కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఉత్తర్వులు వెలువరించింది. రాజ్యసభ ఎంపీ సంజయ్‌కుమార్‌ఝా ఛైర్మన్‌గా వ్యవహరించనున్న ఈ కమిటీలో మొత్తం 31మంది ఎంపీలు సభ్యులుగా నియమితులవ్వగా అందులో 21మంది లోక్‌సభ, 10మంది రాజ్యసభనుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. కాగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఈ కమిటీలో చోటు దక్కించుకున్న ఏకైక ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ కావడం గమనార్హం. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక కమిటీలో సభ్యుడిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సూచనల మేరకు రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆయనకు కూటమి నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

సివిల్ సప్లయిస్ మేనేజర్‌గా బాధ్యతలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 27: సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్‌గా దేవులనాయక్ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పార్వతీపురం మన్యం జిల్లా నుంచి బదిలీపై కాకినాడ జిల్లాకు వచ్చారు.

సర్వేఅండ్ ల్యాండ్ రికార్డ్సు ఏడీగా బాధ్యతలు

జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీగా కట్టా శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎన్‌టీఆర్ జిల్లానుంచి బదిలీపై వచ్చారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం: ఐజీ అశోక్‌కుమార్



సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, (చిత్రం)లో ఎస్పీ విక్రాంత్ పాటిల్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 27: గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని, ఏజెన్సీ సరిహద్దు ప్రాంతాలనుంచి హైవేలపై ముఖ్యమైన కూడళ్ల వద్ద ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ఠ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఐజీ) జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కాకినాడ రూరల్ తిమ్మాపురం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, ఎన్‌బీ వారెంట్లు, పాత నేరస్థుల వివరాలు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా నిరోధానికి రాష్ట్రంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. దీనివల్ల పెద్దఎత్తున అక్రమ గంజాయికి అడ్డుకట్ట వేయడం, పెద్దఎత్తున స్వాధీనం చేసుకుంటామని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్స్‌లు ఏర్పాటు చేశామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ప్రత్యేక దృష్టితో ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీఎస్ఆర్ ద్వారా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా, ప్రభుత్వంపై తప్పుడు పోస్టింగ్‌లు పెట్టి రెచ్చగొట్టే వారిపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణ, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఐజీ వెంట ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, కాకినాడ రూరల్ సర్కిల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు ఉన్నారు.

రంగులద్దుతూ.. అందంగా తీర్చిదిద్దుతూ..

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 27: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు కాకినాడ నగరంలో పెద్దఎత్తున జరుగుతున్నాయి. ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమాలు అక్టోబర్ 2న ముగియనున్నాయి. దీనిలో భాగంగా సంపూర్ణ స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా సుందరీకరణ పనులు చేపడుతున్నారు. జగన్నాథపురంలోని ఎన్టీఆర్ బ్రిడ్జిని అందంగా రంగులతో ఇలా తీర్చిదిద్దుతున్నారు.



కాకినాడ జగన్నాథపురం ఎన్టీఆర్ బ్రిడ్జి వద్ద రంగులద్దుతున్న దృశ్యం

మంత్రి నాదెండ్లను కలిసిన తోట సుధీర్ - 7లో

కాకినాడ గ్రాండ్ జీఆర్టీకి పర్యాటక అవార్డు - 7లో

వరదల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం జమయ్యేందుకు చర్యలు

» జిల్లా వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 27: వరదల వల్ల నష్టపోయిన రైతుల బ్యాంకు ఖాతాల్లో పరిహారం జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ తెలిపారు. జిల్లాలో కొంతమంది రైతుల బ్యాంకు ఖాతాలు ఎన్‌పీసీఐ మ్యాపింగ్ కాలేదన్నారు. ఆధార్ అనుసంధానం కాలేదన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పిఠాపురం, కిర్లంపూడి గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాల్లో వ్యవసాయ అధికారులు పర్యటించారన్నారు. పరిహారం జమకాని రైతులకు వీటిపై అవగాహన కల్పించి బ్యాంకులకు ఆయా వివరాలు అందజేశారన్నారు. రైతులు ఇచ్చే వివరాల ఆధారంగా బ్యాంకులు ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేసిన తర్వాత ఆయా ఖాతాల్లో పరిహారం జమవుతుందన్నారు. ఇన్ యాక్టివ్ బ్యాంకు ఖాతాల రైతులు కూడా బ్యాంకర్లను సంప్రదించాలని సూచించారన్నారు. బ్యాంకులకు డాక్యుమెంట్లు అందజేయడం ద్వారా పరిహారం జమయ్యేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. రాష్ట్రప్రభుత్వం నష్టపోయిన ప్రతిరైతుకు పరిహారం అందజేస్తుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.



బెస్ట్ 4స్టార్ హోటల్... కాకినాడ గ్రాండ్ జీఆర్టీ

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని విజయవాడలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా పలు కేటగిరీల్లో అవార్డులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రదానం చేశారు. బెస్ట్ 4 స్టార్ హోటల్స్ విభాగంలో కాకినాడ గ్రాండ్, జీఆర్టీ హోటల్‌కు ఎక్సలెన్స్ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకారం


లక్ష్మణరావుకు అభినందనలు తెలుపుతున్న జడ్పీ ఉద్యోగులు

జడ్పీ సీఈవోగా లక్ష్మణరావు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 27: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సీఈవోగా వీవీఎస్ లక్ష్మణరావు బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఇన్‌చార్జి సీఈవో పి.నారాయణమూర్తి బాధ్యతలు అప్పగించారు. లక్ష్మణరావు డ్వామా విభాగంలో విజయనగరం జిల్లా గరివిడి క్లస్టర్‌లో ఏపీడీగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పీలోని వివిధ విభాగాల అధిపతులు, ప్రజాప్రతినిధులతో కలిసి జిల్లా అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. జడ్పీ ఉద్యోగులు సీఈవోను కలిసి అభినందనలు తెలిపారు. ఆయన కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.


రమేష్‌బాబుకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

దేవదాయ శాఖ కాకినాడ జోన్ ఉప కమిషనర్‌గా రమేష్‌బాబు

పోర్టు సిటీ (కాకినాడ), సెప్టెంబరు 27: దేవదాయ, ధర్మదాయ శాఖ కాకినాడ జోన్ ఉప కమిషనర్‌గా డీఎల్‌వీ రమేష్‌బాబు కాకినాడ రామారావుపేటలోని ధార్మిక భవన్‌లో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీసీగా పనిచేసిన ఎం.విజయరాజును కర్నూలు జిల్లా ఉరవకొండ నరసింహ స్వామి దేవాలయం ఈవోగా బదిలీ చేశారు. శ్రీకాకుళం జిల్లా అరసవిల్లి సూర్యనారాయణమూర్తి దేవస్థానం ఈవో రమేష్‌బాబును కాకినాడ జోన్ డీసీగా నియమించారు. గతంలో ఈయన రెండేళ్లు ఇన్‌చార్జి డీసీగా విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ మూడు జిల్లాల పరిధిలో 250 దేవాలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రముఖమైన విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం తమ పరిధిలో ఉందన్నారు. బాధ్యతలు స్వీకరించిన రమేష్‌బాబును సహాయ కమిషనర్లు అల్లు భవాని, విజయలక్ష్మి, రామమోహనరావు, దేవదాయ శాఖ జిల్లా అధికారి కాళ్లకూరి నాగేశ్వరరావు, తనిఖీదారులు వడ్డి ఫణీంద్ర కుమార్, బాలాజీ, గుర్రం ప్రసాద్, డేగల సతీష్ అభినందించారు.



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న అధికారులు, కడియం ఆవ ప్రాంతంలో రైతులు, గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీ శాఖ అధికారులు

చిరుత అడుగు జాడేదీ!

- అదిగో పులి... ఇదుగో తోక అంటూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం
- ఆందోళనలో ప్రజలు, అయోమయంలో అటవీ శాఖ అధికారులు

కడియం, సెప్టెంబరు 27: అదిగో పులి... ఇదిగో తోక అంటూ జరుగుతున్న ప్రచారంతో తూర్పు గోదావరి జిల్లా కడియం మండల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కొద్దిరోజులుగా వారి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న పులి విషయంలో ఇదే తంతు జరుగుతోంది. కడియం నర్సరీ ప్రాంతానికి పులి వచ్చిన నాటి నుంచి ప్రజలు భయాందోళనకు, దాని జాడ కానరాక అధికారులు అయోమయానికి గురవుతున్నారు. చిరుత పులి అక్కడ ఉంది.. ఇక్కడ ఉంది అంటూ సోషల్ మీడియాలో ప్రచారంతో ప్రజలంతా గందరగోళానికి గురవుతున్నారు. మంగళవారం కడియపులంక దోసాలమ్మ కాలనీ సమీపంలోని ఓ నర్సరీలో చిరుతను చూసిన వారు అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పాదముద్రలు చూసి అవి పులివే అని నిర్ధారించారు. ఆ తర్వాత ఎవరూ పులిని చూసిన దాఖలాలు లేవు. ఏ సీసీ కెమెరాకూ చిక్కలేదు. అధికారులు పులి కదలికలను గుర్తిస్తున్నారు. శుక్రవారం చిరుత పులి జాడ కనిపించలేదు. ఈ నెల 26న కనిపించిన ప్రాంతంలో 20 కెమెరాలు ఏర్పాటు చేశారు. అవి రాత్రంతా ఆ ప్రాంతాన్ని చిత్రీకరించాయి. శుక్రవారం కెమెరాలను అధికారులు పరిశీలించినా ఎక్కడా చిరుత జాడ కానరాలేదు. ఉదయం నుంచీ వర్షం కురవడంతో దాని పాదముద్రలు లేవు. దాంతో పుకార్లు షికార్లు చేస్తున్నారు. పులి వెళ్లిపోయిందని విస్తృత ప్రచారం చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల లాకుల సమీపంలో చిరుతను చూశామని కొందరు ఇచ్చిన సమాచారంతో డీఎఫ్‌వో ఎంవీ ప్రసాదరావు ఓ బృందాన్ని అక్కడకు పంపించారు. అయితే ఎటువంటి ఆనవాళ్లు లేవు. కడియం ఆవ ప్రాంతంలో చిరుతను చూశామని ఇంకొందరు చెప్పడంతో మరో బృందం అక్కడికి వెళ్లింది. పరిశీలించగా ఎటువంటి జాడ కనిపించలేదు. గురువారం రాత్రి దుళ్లలో ఉందని కొందరు, ఏడిదలో ఉందని మరికొందరు సమాచారం ఇవ్వడంతో ఆయా ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎవరు ఎటువంటి సమాచారం ఇచ్చినా అధికారులు అక్కడకు వెళ్తున్నారు. చిరుత సమాచారం విషయంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు సూచిస్తున్నారు. ఎక్కడ పాదముద్రలు కనిపించినా ఆ ఫొటోలు, వీడియోలు తీసి తమకు సమాచారమిస్తే అవి పులివో కాదో నిర్ధారణ చేస్తామని అధికారులు చెప్తున్నారు.




చొప్పెల్ల లాకులు

భయం గుప్పిట్లో లంక గ్రామాలు

ఆలమూరు, సెప్టెంబరు 27: ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో గోదావరికి వరదలు వస్తాయని, అవి లంక గ్రామాలను ముంచెత్తుతాయని ప్రజలు ఆందోళన చెందుతారు. అయితే వారిని ఈసారి కొత్త భయం పట్టుకుంది. అదే చిరుత పులి. దివాన్‌చెరువు రిజర్వ్ ఫారెస్టు నుంచి ఓ చిరుత ఆలమూరు మండలాన్ని ఆనుకుని వున్న కడియం మండలం కడియపులంక, బుర్రిలంక, వీరవరం ప్రాంతాల్లో సంచరిస్తోందన్న సమాచారంతో ఇక్కడి లంక గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. కడియపులంక, వీరవరం, పొట్టిలంకలతో సమానంగా ఆలమూరు మండలంలోని మడికి, ఇతర గ్రామాల్లో నర్సరీలు అధికంగా ఉన్నాయి. దీంతో చిరుత అక్కడి నుంచి ఈ ప్రాంతాలకు వెళ్లొచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు. లంక గ్రామాల్లో నర్సరీలు, తోటలు అధికంగా ఉండడంతో పులి ఈ ప్రాంతానికి రావొచ్చని భావిస్తున్నారు. దీంతో లంకవాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మండలంలోని లంక గ్రామాల్లో రెండు రోజులుగా పులి మీదే జోరుగా చర్చ జరుగుతోంది. కొందరు ఆకతాయులు పులి మన ఊరు వచ్చేసిందంటూ భయపెడుతున్నారు. ఇటువంటి పుకార్లను నమ్మవద్దని అధికారులు హెచ్చరిస్తూ రాత్రివేళ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సూర్యనారాయణ

న్యూక్లియర్ సైన్స్‌తోనే సమాజ అభివృద్ధి

ఏలేశ్వరం, సెప్టెంబరు 27: కాకినాడ జిల్లా ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక, రసాయన, గణిత శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సదస్సు నిర్వహించారు. విశాఖపట్నం బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్తలు ఎంవీ సూర్యనారాయణ, గౌరీశంకర్, ఎస్‌డీవీవీ జగన్నాథరావు, కె.రాఘవేంద్రరావు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన శాస్త్రవేత్త సూర్యనారాయణ మాట్లాడు తూ న్యూక్లియర్ సైన్స్‌తోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. వ్యాధులు నివారించడంలోను, మానవుని జీవిత కాలాన్ని పెంచడంలోను న్యూక్లియర్ సైన్స్ ముఖ్య పాత్ర వహిస్తుందన్నారు. ప్రస్తుత టెక్నాలజీ మానవ విలువల్లో ప్రత్యేక పాత్ర పోషిస్తోందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రిన్సిపాల్ సునీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇన్‌చార్జి ప్రగడ ప్రయాగమూర్తి మాట్లాడుతూ విశాఖపట్నం బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్తలు తమ విద్యార్థులకు న్యూక్లియర్ సైన్స్ ఆన్‌లైన్ రీసెర్చ్, ఆఫ్‌లైన్ రీసెర్చ్ అంశాలను చక్కగా వివరించారన్నారు. సదస్సులో సురేష్, రామారావు, మదీనా, వీరభద్రరావు, బంగార్రాజు, పుష్ప, సతీష్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కోట సత్తెమ్మ అమ్మవారి హుండీల ఆదాయం రూ.20 లక్షలు

నిడదవోలు, సెప్టెంబరు 27: తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోట సత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో హుండీలను దేవదాయ శాఖ తనిఖీదారు ఎ.సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం తెరిచి లెక్కించారు. జూన్ 6 నుంచి సెప్టెంబరు 27 వరకు వరకు 92 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.19,64,972, అన్నదాన ట్రస్టు హుండీ ద్వారా రూ.1,20,664... మొత్తం రూ.20,85,636 ఆదాయం లభించినట్టు సహాయ కమిషనరు, కార్యనిర్వహణాధికారి వి.హ రిసూర్యప్రకాష్ తెలిపారు. 10 గ్రాముల బంగారం, 205 గ్రాముల వెండి కూడా లభించిందన్నారు. లెక్కింపులో ఫౌండర్ ఫ్యామిలీ మెంబరు, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ఆలయ సిబ్బంది, సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.


అవగాహన ఒప్పంద పత్రాలతో సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్

పొగాకు, ఇతర పంటలపై పరిశోధనకు ఒప్పందం

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 27: కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (సీటీఆర్ఐ) రాజమహేంద్రవరంలో పొగాకుతో పాటు పసుపు, మిరప, అశ్వగంధ, ఆముదం పంటలపై సంయుక్త పరిశోధనలు చేసేందుకు అవగాహన ఒప్పంద సంతకాలు చేసినట్టు డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్ తెలిపారు. శుక్రవారం సీటీఆర్ఐలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, మార్కెటింగ్‌పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సాధికార సంస్థ (ఏపీసీఎన్ఎఫ్), జాతీయ వాణిజ్య పంట పరిశోధన సంస్థ (ఎన్ఐఆర్‌సీఏ)గా రూపాంతరం చెందిన సీటీఆర్ఐతో అవగాన ఒప్పందం చేసుకుందని చెప్పారు. పొగాకుతో పాటు ఇతర పంటలపై పరిశోధనలు చేస్తాయని, భవిష్యత్తులో నాణ్యమైన ఉత్పత్తుల లభ్యతతో పాటు మార్కెటింగ్ సౌకర్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు జిల్లా మేనేజరు బి.తాతారావు, అడిషనల్ డీపీఎం షేక్ వలి, భువి ఎన్‌జీవో సంస్థ అధికారి నరసింహరావు, కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు, సీటీఆర్ఐ విభాగాధిపతులు, ఐటీఎంయూ నోడల్ ఆఫీసర్ హెచ్.రవిశంకర్, రైతులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో పర్యాటకానికి అనుమతిలేదు

ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టరు

రంపచోడవరం, సెప్టెంబరు 27: ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాలలో శని, ఆదివారాల్లో పర్యాటకులకు అనుమతిలేదని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టరు కల్పశ్రీ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఏజెన్సీలో కొండవాగులు పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కొండవాగులు దాటే ప్రయత్నాలు చేయొద్దని ప్రజలకు సూచించారు.

గుర్రం జాషువా 'కవికోకిల' పురస్కారానికి
శిఖామణి ఎంపిక
నేడు విజయవాడలో ప్రదానం



యానాం, సెప్టెంబరు 27: యానానికి చెందిన సుప్రసిద్ధ కవి, 'కవిసంధ్య' సంపాదకుడు డాక్టర్ శిఖామణి గుర్రం జాషువా కవికోకిల పురస్కారానికి ఎంపికయ్యారు. గుర్రం జాషువా 129వ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం తనను ఈ పురస్కారానికి ఎంపిక చేసిందని శిఖామణి తెలిపారు. విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగే జాషువా జయంతి సభలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. దుగ్గనపల్లి ఎజ్రాశాస్త్రి, టి.వరప్రసాద్, పి.రమణయ్య కూడా కవికోకిల పురస్కారానికి ఎంపికయ్యారు. సభలో ప్రత్యేక అతిథులుగా ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన, ముఖ్య అతిథిగా పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ పాల్గొంటారు.

29, 30, అక్టోబరు1 తేదీల్లో
పది ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు
కడియం, గోదావరి స్టేషన్ల మధ్య సిగ్నలింగ్ పనుల కారణంగా...

సామర్లకోట, సెప్టెంబరు 27: సిగ్నలింగ్ వ్యవస్థలో లోపంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించిన రైల్వే ఉన్నతాధికారులు ఆధునీకరణ పనులు చేపట్టారు. విజయవాడ డివిజన్ పరిధిలో కడియం-రాజమహేంద్రవరం, గోదావరి స్టేషన్-కొవ్వూరు సెక్షన్ల మధ్య ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థను ప్రారంభించబోతున్నారు. ఇందులో భాగంగా నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 29, 30, అక్టోబరు 1 తేదీల్లో సామర్లకోట మీదుగా విశాఖ, విజయవాడ మధ్య రాకపోకలు సాగించే పది ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేస్తే రైల్వే ఉన్నతాధికారులు జారీ చేసిన ఉత్తర్వులు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారికి శుక్రవారం రాత్రి చేరుకున్నాయి.

- తిరుపతి-విశాఖ డబుల్ డెక్కర్ (22708)ను ఈ నెల 29న రద్దు చేశారు.
- విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ (22707)ను ఈ నెల 30న రద్దు చేశారు.
- విజయవాడ-విశాఖ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12718), విశాఖ-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717) ఈ నెల 30న రద్దు చేశారు.
- విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240)ను ఈ నెల 30, అక్టోబరు 1 తేదీల్లో రద్దు చేశారు.
- గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239)ను ఈ నెల 29, 30 తేదీల్లో రద్దు చేశారు.
- విశాఖ-గుంటూరు (22701), గుంటూరు-విశాఖ (22702) ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 30న రద్దు చేశారు.
- రాజమహేంద్రవరం-విశాఖ (07466), విశాఖ-రాజమహేంద్రవరం (07467) మెము ప్యాసింజర్లను ఈ నెల 30న రద్దు చేశారు.


మంత్రి మనోహర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన సుధీర్

మంత్రి మనోహర్‌ని కలిసిన
తోట సుధీర్

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 27: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన తోట సుధీర్ శుక్రవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్పొరేషన్ ఛైర్మన్‌గా తనకు నియమించినందుకు మనోహర్‌కు సుధీర్ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో రైతులకు ఉపయోగపడేలా పని చేయాలని మంత్రి సూచించినట్లు వెల్లడించారు. పేదలకు రేషన్ సరుకులు సకాలంలో అందేలా పటిష్ఠమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తాదమని మంత్రి పేర్కొన్నారు. కార్పొరేషన్ ఛైర్మన్‌గా త్వరలో ప్రమాణం చేస్తానని సుధీర్ చెప్పారు.

బాధితులందరికీ న్యాయం చేస్తాం

- జీరో నుంచి రూ.500 కోట్ల మేర స్థిరాస్తుల గుర్తింపు
- సీజ్ చేసిన ఆస్తుల విక్రయానికి ప్రభుత్వ అనుమతి కోసం నిరీక్షణ
- జయలక్ష్మి కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు
- సభ్యులుగా పాత డైరెక్టర్లు ఇద్దరి ఎంపిక

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 27: కోట్లాది రూపాయలు డిపాజిట్లు వసూలు చేసి మోసానికి పాల్పడిన నిందితులు, రుణగ్రస్తుల నుంచి చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా డబ్బులు వసూలు చేసి బాధితులందరికీ న్యాయం జరిగేలా విశేష కృషి చేస్తున్నామని జయలక్ష్మి కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు తెలిపారు. ది జయలక్ష్మి ఎంఏఎం కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సంస్థ 3వ మహాజన సమావేశాన్ని శుక్రవారం కాకినాడ దంటు కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ పాత కార్యవర్గం చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు సుమారు రూ.582కోట్ల మోసానికి పాల్పడ్డారన్నారు. కొత్తగా ఏర్పాటైన పాలకవర్గం 2022 అక్టోబరు 3న బాధ్యతలు చేపట్టిందన్నారు. జీరో స్థాయి నుంచి లోన్లు, డిపాజిట్లకు చెందిన వాటి వివరాలు ఏమీ లేకపోయినా అహర్నిశలూ కృషి చేసి రికార్డులు, ఫైల్స్ తయారు చేసి, డిస్ప్యూట్ సెటిల్‌మెంట్ కమిటీ, అడ్వకేట్ నియామకం, సీఐడీ అధికారులు, పోలీసులు, ట్రిబ్యునల్ కోర్టుకు వెళ్లడం, నిందితులపై సివిల్ కేసులు దాఖలు చేశామన్నారు. రుణాల వసూళ్లకు ప్రత్యేక చర్యలు, 84 మంది నిందితుల స్థిరాస్తులను సీఐడీ సీజ్ చేయించిందని, వాటి విలువ సుమారు రూ.300 కోట్లు ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో సీజ్ చేసిన 110 ఆస్తుల విలువ సుమారు రూ.200 కోట్లు ఉంటుందన్నారు. సీఐడీ 495 మందిపై ట్రిబ్యునల్ కేసు వేయగా ఇందులో 190 మందిపై రూ.497 కోట్ల రికవరీ కోసం సివిల్ కేసులు దాఖలు చేస్తున్నామన్నారు. జీరో స్థాయి నుంచి కాకినాడలో ప్రత్యేక బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేసి రూ.4.43,51,898 కోట్లు రికవరీ చేశామన్నారు. వడ్డీల రూపంలో 43.32 లక్షలు వచ్చిందన్నారు. కోర్టు సీజ్‌లో రూ.6కోట్లు ఉందని, మొత్తంగా రూ.10 కోట్లు ఉందన్నారు. నిందితుల స్థిరాస్తులను చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా స్వాధీనం చేసుకుని, బాధితులందరికీ డిపాజిట్ సొమ్ము చెల్లిస్తామన్నారు. కొంత మంది పనిగట్టుకుని పాలకవర్గంపై విష ప్రచారం చేస్తున్నారన్నారు. డిపాజిటర్ల ఆర్థిక ప్రయోజనాలే ముఖ్యంగా డైరెక్టర్లంతా సమష్టిగా పని చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, త్వరితగతిన సేల్ ఆర్డర్ వచ్చేలా ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. సొసైటీ తరఫున ప్రభుత్వం, కోర్టు, సీఐడీ, రుణగ్రహీతలపై జరిపే లావాదేవీలన్నిటినీ పాలకవర్గ సభ్యులకు అప్పగిస్తూ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇద్దరు డైరెక్టర్ల ఎన్నికలో కొంత గందరగోళం నెలకొంది. పాత డైరెక్టర్లు జోస్యుల స్వామిప్రసాద్ (అమలాపురం), షేక్ జానీ పాషా (కాకినాడ)లను సభ్యులుగా తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో డైరెక్టర్లు సీహెచ్ సుబ్బారావు, పీవీ రమణమూర్తి, కె.గౌరీశంకరరావు, ఏవీఎస్ రవికుమార్, ఎ.శ్రీనివాస్, కె.సురేష్, ఎ.గవర్రాజుకుమార్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన సుమారు 520 మంది సభ్యులు పాల్గొన్నారు.



దంటు కళా క్షేత్రంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న త్రినాథరావు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

కోకనాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్‌గా బాబు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 27: ది కోకనాడ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్‌గా వీడవీ రాఘవులు(బాబు) ఎన్నికయ్యారు. కెనాల్ రోడ్‌లోని చాంబర్ భవనంలో గురువారం రాత్రి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో చైర్మన్‌గా బాబు ఐదోసారి ఎన్నికవ్వగా, సభ్యులుగా ఏకే విశ్వనాధం, ఏవీ రంగారావు, గాదం మహేష్, వీవీ రావు, దంటు భాస్కర్, ఎంఎస్ కుమార్, శ్రీరాం భగవత్, సి.నరసింహరావులను ఎన్నుకున్నారు.

రోడ్ల నిర్మాణాలకు మహర్దశ: ఎమ్మెల్యే చినరాజప్ప


హుస్సేన్‌పురంలో రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, సెప్టెంబరు 27: గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రధాన రహదారులే గాకుండా గ్రామీణ రహదారులు సైతం ఎటు వంటి అభివృద్ధికీ నోచుకోలేకపోయాయని ముఖ్యమంత్రిగా చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కేవలం వంద రోజులకే గ్రామీణ రోడ్లనిర్మాణాలకు శ్రీకారం చుట్టిందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట మండలం అచ్చంపేట, హుస్సేన్‌పురం గ్రామాలలో రూ.55 లక్షల ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే చినరాజప్ప శుక్రవారం శంకుస్థాపన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చినరాజప్ప విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతీ నియోజకవర్గానికి రూ.10కోట్లు చొప్పున ఉపాధిహామీ నిధులుగా గ్రామీణ ప్రాంతాలలో సీసీ రోడ్లు నిర్మాణాల కోసం మంజూరు చేశారన్నారు.

'జగన్‌పై ప్రజావ్యతిరేకత ఆనాడే వెల్లడైంది'

రాష్ట్రంలో అరాచక పాలనకు ప్రజలు విసిగి, వేసారి ఎన్నికలలో జగన్‌ను ఘోరపరాజయం పాల్జేసినా ఇంకా తెలుసుకోకుండా మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తుండడం సిగ్గులేనితనమేనని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఎద్దేవా చేశారు. శుక్రవారం సాయంత్రం సామర్లకోటలో విలేకరులతో ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆరాధ్యదైవంగా భావించే తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని, వైసీపీ నాయకులను ప్రజలు ఛీత్కరించుకుంటున్నారన్నారు. ఇంతటి అపచారం చేసిన జగన్‌రెడ్డి తాను తప్పు చేసినట్లు గ్రహించినా ఇంకా మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ తాను తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తానని ప్రకటించడం అంతా వ్యతిరేకిస్తున్నారన్న విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్నారన్నారు.

గంజాయితో యువకుల అరెస్టు

శంఖవరం, సెప్టెంబరు 27: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను అన్నవరం పోలీసులు అరెస్టు చేశారు. తొండంగి మండలం బెండపూడికి చెందిన బి.నూకరాజు, కత్తిపూడికి చెందిన పి.జోగేంద్రలు గంజాయికి బానిసయ్యారు. ఒడిస్సా అటవీ ప్రాంతం నుంచి గంజాయి తెచ్చుకుంటూ కొంత వాళ్లు సేవిస్తూ మరికొంత అధికరేట్లకు విక్రయిస్తున్నారు. శుక్రవారం కత్తిపూడి శివార్లలో గంజాయిని తీసుకువెళ్తుండగా అన్నవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.కిషోర్ తెలిపారు. నిందితులను అరెస్టుచేసిన సీఐ సూర్యఅప్పారావు, ఎస్ఐ కిషోర్, ఏఎస్ఐ ఎల్.ప్రసాద్‌లను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు.


ఎమ్మెల్యే కొండబాబును సత్కరిస్తున్న దృశ్యం


సర్పవరం: సంక్షేమ పథకాలను వివరిస్తున్న అనంతలక్ష్మీసత్యనారాయణమూర్తి


జగ్గంపేటలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను సత్కరిస్తున్న దృశ్యం

వంద రోజుల్లోనే ప్రగతిని సాధించాం

● ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 27: సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అభివృద్ధిని కొనసాగిస్తూ వంద రోజుల్లోనే కూటమి ప్రభుత్వం ప్రగతిని సాధించిందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొండయ్యపాలెంవద్ద 41,43,44,45,46 డివిజన్లకు సంబంధించి ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు అందించే సేవలను డిప్యూటీ కమిషనర్ మనోహార్, అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, టూటౌన్ సీఐ అప్పలనాయుడు, హౌసింగ్ డీఈ సత్యనారాయణ, హెల్తాఫీసర్ పృధ్వీచరణ్, టీపీఆర్వో శైలజ వివరించారు. స్థానిక 36వ డివిజనలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వనమాడిని డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్ శాలువాతో సత్కరించారు. మాజీ మేయర్ సుంకర పావని తిరుమలకుమార్, నల్లూరి తులసి, డాక్టర్ కొండమూరి సత్యనారాయణ, సంగిశెట్టి అశోక్, గుమ్మళ్ల చిన్న, పిన్నమ్మరెడ్డి బుజ్జి, బొల్లోజు ఉమామహేశ్వ రరావు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాం: ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట: ఇది పేదల ప్రభుత్వం అని, ఇచ్చిన హామీలను నెరవేర్చే ప్రభుత్వం అని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జగ్గంపేట నియోజకవర్గ జనసేన, బీజేపీ ఇన్‌చార్జ్‌లు తుమ్మలపల్లి రమేష్, దాట్ల కృష్ణవర్మ అతిథిలుగా పాల్గొన్నారు. ఎస్సీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, కందుల చిట్టిబాబు, సర్పంచ్ బచ్చల నాగరత్నం, అడబాల వెంకటేశ్వరరావు, బుర్రి సత్తిబాబు, రుచి హోటల్ నాగేంద్ర, వేములకొండ జోగారావు,ఎమ్మార్వో, ఎంపీడీవో, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

●జగ్గంపేట నియోజకవర్గంలో జగ్గంపేట టౌన్‌లో గల ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఇది మంచి ప్రభుత్వం ప్రజా వేదికను జగ్గంపేట మండల, గ్రామ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ్ముల పల్లి రమేష్ మాట్లాడుతూ ఈ వంద రోజులు పాలనలో ప్రజల చేత శభాష్ అనిపించుకున్నామన్నారు.


ఏలేశ్వరం: అప్పనపాలెం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ


కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యనమల దివ్య

ప్రజా శ్రేయస్సే కూటమి ధ్యేయం: ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం: ప్రజాశ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. శుక్రవారం పట్టణంలో అప్పనపాలెం 8వ వార్డులో ప్రజావేదిక ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని వంద రోజుల పాలనలో చేసిన పతకాల పోస్టర్‌ను, స్టిక్కర్లను ఆవిష్కరించారు. ప్రత్తిపాడు జనసేన ఇంచార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షులు మూది నారాయణస్వామి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, అలమండ చలమయ్య, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్టపడేవారికి సముచిత స్థానం: ఎమ్మెల్యే దివ్య

తునిరూరల్ : టీడీపీలో కష్టపడే నాయకులకు సముచిత స్థానం ఉంటుందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. తుని సాయి వేదికలో జరిగిన టీడీపీ క్రియాశీలక కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఏజెంట్లు సమావేశంలో ఆమె ప్రసంగించారు. 100రోజుల పాలనలో ప్రజామన్ననలు పొందిన ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆమె తెలిపారు. సభ్యత్వపార్టీ నమోదుపై పలుఅంశాలు కార్యకర్తలతో చర్చించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, దాడి రాజబాబు, చొక్కా అప్పారావు, మోతుకూరి వెంకటేష్,ఇనుగంటి సత్యనారాయణ, చింతమనీడిఅబ్బాయి ఉన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

సర్పవరం జంక్షన్: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని, వరద బాధితులకు రూ.602 కోట్ల సాయం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదని టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం కాకినాడ రూరల్ పి.వెంకటాపురంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి వంద రోజుల కూటమిపాలనలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కర్రి వెంకట్రాజు, బొజ్జ భవానీసాంబశివరావు, యాళ్ల రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదరణ పొందిన మంచి ప్రభుత్వం

తాళ్లరేవు: ప్రజాదరణ పొందిన మంచి ప్రభుత్వం మీముందుకు వస్తుందని గ్రామాల ప్రజలంతా విజయవంతం చేయాలని టీడీపీ నేత టేకుమూడి లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం కోరింగ పంచాయతీ దిండి గ్రామంలో మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని టీడీపీ నేతలు, సచివాలయ అధికారులు నిర్వహించారు. టీడీపీనేతలు పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, మం దాల గంగసూర్యనారాయణ, జవ్వాది తాతాజీ, వెంటపల్లి ఉమా మహేశ్వరి, టేకుమూడి సత్యనారాయణ, పంచాతీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది, టీడీపీనేతలు పాల్గొన్నారు.

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో అర్చన



పెద్దాపురం, సెప్టెంబరు 27: స్థానిక మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో శుక్రవారం అర్చన చేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో వేదపండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం ప్రసాదాలను వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఆదిత్యలో క్లౌడ్ కంప్యూటింగ్‌పై వర్క్‌షాప్

గండేపల్లి, సెప్టెంబరు 27: మండలంలోని సూరంపాలెం ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ కంప్యూటింగ్ అనే అంశంపై ఆరు రోజులపాటు విద్యార్థుల నైపుణ్యం అభివృద్ధి శిక్షణా కార్యక్రమం అక్టోబర్ 1వరకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధి లోవరాజు నిర్వహిస్తారన్నారు.

కాలినడక భక్తులకు ఉచిత భోజన, వసతి సౌకర్యం


రుచి నాగేంద్రచౌదరి

గండేపల్లి, సెప్టెంబరు 27: కాలినడక తీర్థయాత్ర చేసే భక్తులకు ఉచిత భోజనం, వసతి సదుపాయాలు మండలంలో జడ్.రాగంపేట గ్రామ శివారున ఉన్న రుచిదాబా యజమాని నాగేంద్రచౌదరి కల్పిస్తున్నారు. భక్తులందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగేంద్రచౌదరి కోరారు. వసతి సదుపాయం రుచిదాబా ఎదురుగా ఉన్న మోహనసాయికృష్ణ రెసిడెన్సీలో ఏర్పాటుచేసినట్లు తెలిపారు. సంవత్సరమంతా ఈ అవకాశాన్ని వైజాగ్‌నుంచి విజయవాడ వైపు యాత్రకు వెళ్లే భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆశీస్సులతో సుమారు ఆరు సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇటువంటి కార్యక్రమాలు చేయడానికి ముందుకొచ్చిన నాగేంద్రచౌదరిని అభినందిస్తున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 27: ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం సెంటర్ల పరిధిలో మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడిపిన ఏడుగురిని శుక్రవారం స్థానిక కోర్టులో హాజరుపరిచారు. దీంతో నలుగురు నిందితులకు మూడురోజులు జైలు శిక్ష విధిస్తూ జడ్జి జి.బులెమ్మ తీర్పు ఇచ్చారు. మిగిలిన ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు జడ్జి తీర్పు చెప్పారని ఈ కేసులను ప్రత్తిపాడు ఎస్ఐ పవన్‌కుమార్, ఏలేశ్వరం ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు, అన్నవరం ఎస్ఐ కిషోర్‌లు నమోదు చేశారు.

లారీ యూనియన్ అధ్యక్షుడిగా దాసరి శ్రీనివాస్


బాధ్యతలు చేపట్టిన కాకినాడ లారీ యూనియన్ పాలకవర్గం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 27: కాకినాడ లారీ యూనియన్ అధ్యక్షుడిగా దాసరి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సినిమారోడ్‌లోని వైఎంవీఏ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన లారీ యూనియన్ సర్వసభ్య సమావేశంలో పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసరి శ్రీనివాస్ ఎన్నికకాగా, ఉపాధ్యక్షులుగా అడిగర్ల గణబాబు, కుచ్చర్లపాటి అర్జునరాజు, చిట్టిమేను సత్యనారాయణ, కార్యదర్శిగా అల్లం రాజు, సంయుక్త కార్యదర్శులుగా ఊదా శ్రీనివాసరావు, యలమంచిలి సత్తిబాబు, కోశాధికారిగా గణేషుల శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కాళ్ల భద్రరావు, కొల్లు రవి నాగవర్మ, నాలిసూర్య రామ్మోహన్‌రావు నియమితులయ్యారు. ప్రతిష్టాత్మకమైన లారీ యూనియన్ అధ్యక్షుడిగా తాను ఎన్నిక కావడంలో ఎమ్మెల్యే కొండబాబు ఆశీస్సులు తనకు ఉన్నా యని, యూనియన్ సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు.

'చేనేత వస్త్రాలను, హస్తకళలను ఆదరించాలి'

పోర్టుసిటీ(కాకినాడ), సెప్టెంబరు 27: చేనేత వస్త్రాలను, హస్తకళలను ఆదరించి వారికి తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. కాకినాడ దేవాలయం వీధిలోని శ్రీపైండా చలమయ్య కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ హ్యాండ్లూమ్స్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన హస్తకళల స్టాళ్లను ఎమ్మెల్యే సందర్శించారు.

'కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 27: కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న 'మన ఊరు ఫౌండేషన్' సంస్థకు ప్రతిఒక్కరూ తమవంతు సహాయ సహకారాలు అందించాలని టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం చైర్మన్ గ్రంధి బాబ్జి పిలుపునిచ్చారు. ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం ఎకో ఫ్రెండ్లీ వినాయక కాంటెస్ట్ విజేతల బహుమతి ప్రదానోత్సవం నిర్వహించగా ముఖ్యఅతిథిగా గ్రంధి బాబ్జి, విశిష్ట అతిథిగా రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వీరభద్రారెడ్డి పాల్గొన్నారు. హరీష్ స్పోర్ట్స్ వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం ప్రథమ బహుమతి, ఇంద్రపాలెంలో ఏర్పాటు చేసిన విగ్రహం ద్వితీయ బహుమతి సాధించాయి. ఈ సందర్భంగా తలాటం హరీష్, గీసాల శ్రీనులను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు విద్యాసాగర్, జేఎన్‌టీయూకే ఎంబీఏ డైరెక్టర్ కృష్ణమోహన్, ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత

కాకినాడ సిటీ, సెప్టెంబరు 27: వికాస ఆధ్వర్యంలో కాకినాడ-జగన్నాథపురంలోని ఏఎస్‌డీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైన 144 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమానికి వికాస పీడీ కె.లచ్చారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా టీడీపీ జిల్లా ప్రొఫెషనల్ వింగ్ చైర్మన్ వనమాడి మోహనవర్మ పాల్గొన్నారు.

చెత్తసేకరణ సక్రమంగా నిర్వహించాలి: కమిషనర్ భావన

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 27: కాకినాడ నగరంలో ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలని నగరపాలక కమిషనర్ భావన సూచించారు. నగర ప్రజలు కూడా తడి, పొడి చెత్తలను వేర్వేరుగా అందజేసి కాకినాడ నగరం స్వచ్ఛంగా ఉండేందుకు సహకరించాలన్నారు. కాకినాడ నగరంలో 42వ డివిజన్ రవిచంద్ర ఆస్పత్రి పరిసర ప్రాంతంలో, 41వ డివిజన్‌లో గాంధీనగర్, చాగంటి వారి వీధిలో పారిశుధ్య నిర్వాహణ పనులను శుక్రవారం కమిషనర్ తనిఖీ చేశారు. ఆమె వెంట శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు ఉన్నారు.

ఆకట్టుకుంటున్న మెప్మా అర్బన్ మార్కెట్

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 27: నగరంలోని రిజర్వు పోలీస్ లైన్ సమీపంలో ఉన్న ఓల్డ్ మీసేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను మెప్మా పీడీ ప్రియంవద శుక్రవారం ప్రారంభించారు. నగరంలోని పలు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శనగా ఉంచారు. కాకినాడ నగరపాలక సంస్థ, మెప్మా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగరపాలక సంస్థ టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకటరాజు, సూపరింటెండెంట్ సతీష్, సీవోలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పిఠాపురంలో అర్బన్ బ్యాంకు ఎన్నికల సందడి

● అయిదు డైరెక్టరు పదవులకు 18 నామినేషన్లు

పిఠాపురం, సెప్టెంబరు 27: పిఠాపురం పట్టణంలో కోఆపరేటివ్ అర్బన్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ(పూర్వ పిఠాపురం అర్బన్‌బ్యాంకు) ఎన్నికల సందడి నెలకొంది. శుక్రవారం అయిదు డైరెక్టరు పదవులకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం సొసైటీ కార్యాలయంలో జరిగింది. నామినేషన్లు గడువు ముగిసే నాటికి 18 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల అధికారి పి.దుర్గాప్రసాద్ తెలిపారు. డైరెక్టర్ పదవుల్లో ఒకటవ నియోజకవర్గానికి బాలిపల్లి రామచంద్రకుమార్(రాంబాబు), జనపరెడ్డి రాంబాబు, విళ్ల వీరవెంకట నాగేశ్వరరావు అనే నాగబాబులు, రెండవ నియోజకవర్గానికి కందవిల్లి లోవరాజు, పుణ్యమంతుల సూర్యనారాయణమూర్తి, చెల్లుబోయిన ప్రమీల, చెల్లుబోయిన నవీన్‌కుమార్‌లు, మూడవ నియోజకవర్గానికి చల్లా గనిబాబు, వేణుం నారాయణరావు, అద్దంకి వెంకటరమణ, వనం వీరబాబులు, నాలుగవ నియోజకవర్గానికి అరిగెల ప్రసాదరావు, రాయవరపు తిరుమలరావు, మాగాపు సతీష్‌లు, అయిదవ నియోజకవర్గానికి మేళం రామకృష్ణ, బిరుసు వర్ధీశ్వరరావు, ఫైలా శ్రీనివాస రాజు, కాలచర్ల వెంకటేశ్వరరావులు నామినేషన్లు దాఖలు చేశారు.

రైల్వే ఉన్నతాధికారి తనిఖీలు

సామర్లకోట, సెప్టెంబరు 27: సామర్లకోట, కాకినాడ రైల్వే స్టేషన్లను దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ సర్వీసు ఇంజనీరు బ్రిజ్ మోహన్‌మీనా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సామర్లకోట రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ సీఈఎస్ఈ అధికారి వెంట పాల్గొన్నారు. స్టేషన్ ఆవరణలో ఉన్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు. అలాగే ప్రయాణికులు కొనుగోలుచేసే స్టాల్స్ వద్ద ఆమార ప్యాకెట్ల ధరలతో పాటూ శీతలీకరణ బాటిళ్ల ధరలను పరిశీలించారు. ప్రతీ స్టాల్ వద్దా ఎమ్మార్పీ ధరల పట్టిక తప్పని సరిగా ప్రదర్శించాలన్నారు. అనంతరం కాకినాడటౌన్ రైల్వేస్టేషన్ తనిఖీలు నిమిత్తం వెళ్లారు. ఈ సందర్భంగా సీఈఎస్ఈ మీనా వెంట సామర్లకోట రైల్వే అధికారులు రమేష్, రవికాంత్, సంతోష్, జగ్గారావు, నారాయణ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఎస్ఈ ప్రసాద్‌కు ఏడీఈ అభినందన

సామర్లకోట, సెప్టెంబరు 27: కాకినాడజిల్లా విద్యుత్ సూప రింటెండెంట్ ఇంజనీరుగా మొట్టమొదటిసారిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన జి.ప్రసాద్‌ను సామర్లకోట విద్యుత్ ఏడీఈ కిరణ్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఇప్పటివరకూ విద్యుత్ ఎస్ ఈ కార్యాలయం రాజమహేంద్రవరంనకే పరిమితం కాగా జిల్లాల విభజన అనంతరం ఏర్పాటైన కాకినాడ సూపరింటెండెంట్ ఇంజ నీరు విభాగాన్ని కాకినాడ ఏఏవో కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన విషయం విధితమే. ఇక నుంచి సామర్లకోట, పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారం కాకినాడ ఎస్ఈ కార్యాలయంనకు అనుసంధానం చేశారు.

వందేభారత్‌కు హాల్ట్ ఇవ్వాలని తుని ఎమ్మెల్యే లేఖ

తునిరూరల్, సెప్టెంబరు 27: పర్యాటకంగా అభివృద్ధి చెందుతూ వేలాది మంది భక్తులు రాకపోకలు సాగిస్తున్న అన్నవరం రైల్వేస్టేషన్‌కు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు తుని వద్ద హాల్ట్ ఇవ్వాలని తుని ఎమ్మెల్యే యనమల దివ్య ఎంపీలకు లేఖ రాశారు. ఈ మేరకు కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్, ఏలూరు ఎంపీ పుట్ట మహేష్‌యాదవ్‌లకు ఆమె లేఖ రాశారు. రైల్వే మంత్రిత్వశాఖతో చర్చించి తమ ప్రాంతవాసుల ఆకాంక్షను నెరవేర్చాలని ఆమె కోరారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఇద్దరి ఎంపిక

తొండంగి, సెప్టెంబరు27: రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు బెండపూడి ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నాగం కృష్ణమూర్తి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల, జిల్లా స్థాయిలో ఎంపికైన తొమ్మిదవ తరగతి విద్యార్థి దార్ల హరీష్, అండర్ 16 విభాగంలోను, ఏడవ తరగతి విద్యార్థి యడ్ల రాకేష్ అండర్ 14 విభాగంలోను ఎంపికయ్యారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఎంఈవోలు షేక్‌బాబ్జి, ఎ. సుబ్బిరెడ్డి, తదదితరులు అభినందించారు.

ప్రత్తిపాడులో సంఘం డెయిరీ ప్రారంభం

ప్రత్తిపాడు, సెప్టెంబరు27: ప్రత్తిపాడు అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో సంఘం డెయిరీ కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ప్రారంభించారు. సంఘం డెయిరీ పాలు ఉత్పత్తులు ప్రత్తిపాడు ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన నిర్వాహకులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్మల కన్నబాబు,యాళ్ళ జగదీష్, అంబటి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో గ్రీవెన్స్‌లో పాల్గొన్న కటకంశెట్టి

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 27: కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ కో కోఆర్డినేటర్, రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) శుక్రవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మట్టా ప్రకాశ్‌గౌడ్ పాల్గొన్నారు.

'సుధాకర్‌ప్రసాద్ సేవలు చిరస్మరణీయం'

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 27: రెవెన్యూ ఉద్యోగుల పోరాట యోధుడు సుధాకర్‌ప్రసాద్ సేవలు చిరస్మరణీయమని ఏపీ జేఏసీ అమరావతి కాకినాడ జిల్లా చైర్మన్ పితాని త్రినాథ్ అన్నారు. కాకినాడ రెవెన్యూ భవనంలో శుక్రవారం సుధాకర్‌ప్రసాద్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగుల డిమాండ్ల సాధనకు ఆయన ఎంతో కృషి చేశారన్నారు. నిరంతరం ఆయన ఉద్యోగుల హక్కుల సాధన కోసం శ్రమించారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రామ్మోహన్‌రావు, శివ, విజయ్, ప్రసాద్, గోవిందు, సంధ్య, శివరామకృష్ణ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మెడికల్ ఇన్‌వేలిడేషన్‌పై కోర్టు ఆరా

కాకినాడ క్రైం, సెప్టెంబరు 27: తన ఉద్యోగాన్ని కొడుకుకు ఇప్పించేందుకు తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించిన వైనంపై హైకోర్టు ఆరా తీసింది. వి.వెంకట్రావు అనే వ్యక్తి కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో అటెండర్‌గా పనిచేసేవాడు. ఆ శాఖలో తన కొడుక్కు ఉద్యోగం ఇప్పించాలన్న తలంపుతో గుండెనొప్పి అని చెప్పి కాకినాడ జీజీహెచ్‌లోని కార్డియాలజీ వార్డులో 2001, మే 3నుంచి 19వరకు 15రోజులు పాటు చికిత్స పొందాడు. దీర్ఘకాలిక వ్యాధిగా నిర్ధారించే సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేశాడు. అప్పటి ఆస్పత్రి మెడికల్‌బోర్డులో సూపరింటెండెంట్ డాక్టర్ భానుమతి, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రంగస్వామి, సర్జరీ వైద్యుడు డాక్టర్ మోహన్‌రావు ఉన్నారు. వారి నివేదిక ఆధారంగా జారీ చేసిన సర్టిఫికెట్ ఆధారంగా వెంకట్రావు స్థానంలో అతడి కొడుక్కి ఉద్యోగం వచ్చింది. ఇటీవల ఆ ఉద్యోగం తప్పుడు సర్టిఫికెట్‌లతో సంపాదించినదని ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించడంతో కేసును స్వీకరించిన కోర్టు జీజీహెచ్‌కు అప్పటి వాస్తవికతను తెలియజేయాలని ఆదేశించింది.

ఖోఖో పోటీలకు శ్రీ ప్రకాష్ విద్యార్థుల ఎంపిక


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో విద్యాసంస్థల అధినేత నరసింహారావు

తుని రూరల్, సెప్టెంబరు 27: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు శ్రీ ప్రకాష్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు సీబీఎస్ఈ బోర్డు తెలంగాణా రాష్ట్రంలో విజ్ఞాన జ్యోతి రెసిడెన్షియల్ స్కూల్లో నిర్వహించిన క్లస్టర్7 పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు సత్తా చాటారు. అండర్-14 బాలుర విభాగంలో లాలం పూర్ణ శ్యాంనాయుడు, అండర్19 బాలుర విభాగంలో జి. ధమేష్ బృందం ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. అండర్14బాలికల విభాగంలో జి. కావ్యసుధ బృందం తృతీయ స్థానం సాధించి కాంస్య పతకాలు అందుకున్నారు. శ్రీ ప్రకాష్ విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌కేవీ నరసింహారావు, కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, కోచ్‌లు చిరంజీవిలతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

కాకినాడ జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా కురసాల కన్నబాబు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 27: కాకినాడజిల్లా వైసీపీ అధ్యక్షుడుగా మాజీ మంత్రి, రూరల్ మాజీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబును ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ నియమించారు. శుక్రవారం తాడేపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు కన్నబాబును తిరిగి రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన మాజీ సీఎం జగన్‌కు కురసాల కన్నబాబు కృతజ్ఞతలు తెలిపారు. కన్నబాబు నియామకం పట్ల జడ్పీటీసీలు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సివిల్ సప్లయిస్ మాజీ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, ఏఎంసీ మాజీ చైర్మన్ గీసాల శ్రీను, బెజవాడ సత్యనారాయణ, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

జడ్పీ సీఈవోను కలిసిన ఎస్టీయూ నాయకులు

కాకినాడరూరల్, సెప్టెంబరు 27: ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా నూతన సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన వీవీవీఎస్ లక్ష్మణరావును ఎస్టీయూ కాకినాడ జిల్లా శాఖ అధ్యక్షుడు మోర్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘ నాయకులు శుక్రవారం కలిసి అభినందించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. 2023-24 కు సంబంధించిన ఉపాధ్యాయుల పీఎఫ్ స్లిప్‌లను అందుబాటులో ఉంచాలని, ఎల్ఐసీ బీమా వాయిదా సొమ్మును ఎప్పటికప్పుడు బీమా సంస్థకు చేరేలా చూడాలని కోరారు. సీఈవోను కలిసిన వారిలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కాశీవిశ్వనాథ్, రాష్ట్ర కార్యదర్శి శ్రీను, కన్వీనర్ సంపత్‌కుమార్, రాజు, రామకృష్ణ, మహేష్, శివప్రసాద్‌లు ఉన్నారు.

వరద బాధితులకు లయన్స్‌క్లబ్ రూ.5లక్షలు విరాళం

తాళ్లరేవు, సెప్టెంబరు 27: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సేకరించిన విరాళాలను లయన్స్‌క్లబ్‌ల ప్రతినిధులు సుంకరపాలెం రవి, జూనియర్ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యేదాట్ల బుచ్చిబాబుకు శుక్రవారం రూ.5లక్షల నగదును అందజేశారు. యానాం, కాపులపాలెం, కనకాలపేట, అమలాపురం లయన్స్‌క్లబ్‌ల ప్రతినిధులు వరద బాధితుల సహాయార్థం సేకరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీహోమం

అన్నవరం, సెప్టెంబరు27: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్ర జపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

● కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

కొత్తపల్లి, సెప్టెంబరు 27: పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. కొత్తపల్లి మండలం వాకతిప్పలో జనసేన నాయకుడు రావు అక్షయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావే శంలో ఆయన పాల్గొన్నారు. జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ ఆదేశాలమేరకు గ్రామాల్లో మౌలికసదుపాయాలు కల్పించేందుకు అహర్నిశలు పనిచేస్తాన న్నారు. వాకతిప్పలో కమ్యూనిటీ హాలు, కొత్తపల్లి నుంచి పాటిమీదకు వెళ్ళే రహదారి, కుతుకుడుమిల్లి గ్రామానికి శ్మశానవాటిక ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జనసేన నాయకుడు అక్షయ్ ఎంపీ శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జనసైనికులు మత్సా అప్పాజీ, గింజాల శ్రీనివాస్, సానా నాగు, వాడ్రదనబాబు, తోలేటి శిరీష,లాజరుబాబు పాల్గొన్నారు.

'సభ్యుల సహకారంతో సంఘాభివృద్ధి'


జడ్.బావారం సొసైటీ మహాజన సభ నిర్వహిస్తున్న దృశ్యం

కరప, సెప్టెంబరు 27: సభ్యుల సమిష్టి సహకారంతో సంఘాభివృద్ధికి కృషిచేస్తున్నట్టు జడ్.బావారం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ ఎస్‌వీఎస్ఎస్ఆర్‌కే దుర్గాప్రసాద్ తెలిపారు. స్థానిక సంఘ భవనంలో శుక్రవారం జరిగిన మహాజనసభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘ కార్యకలాపాలు, సాధించిన ప్రగతిని సభ్యులకు వివరించారు. సొసైటీ సీఈవో రాయుడు వెంకటేశ్వరరావు(చిట్టియ్య) గత ఆరునెలల జమా-ఖర్చులు, 2023-24 ఆడిట్ రిపోర్టు, లాభాల పంపిణీ తదితర అంశాలపై సభలో చదివి వినిపించగా సభ్యులు ఆమోదించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు మందుల కిట్లను పంపిణీచేశారు. అలాగే సొసైటీ ప్రాంగణంలో పలు మొక్కలు నాటి నీళ్లుపోశారు.

నగరపంచాయతీ కమిషనర్‌గా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



ఏలేశ్వరం, సెప్టెంబరు 27: ఏలేశ్వరం పట్టణ నగర పంచాయతీ కమిషనర్‌గా ఎం.సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అద్దంకి మున్సిపల్ కార్యాలయం నుంచి బదిలీపై ఏలేశ్వరం వచ్చారు. ప్రస్తుత కమిషనర్ శివప్రసాద్ విశాఖపట్నం జోనల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. సత్యనారాయణ మున్సిపల్ నగర పంచాయతీ చైర్పర్సన్ అలమండ సత్యవతిని కలిసి బాధ్యతలు చేపట్టారు.

వర్షాలకు కుప్పకూలిన పెంకుటిల్లు



గండేపల్లి, సెప్టెంబరు 27: రామయంపాలెం గ్రామంలో శుక్రవారం ఉదయం గత కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోడలు పూర్తిగా నానిపోయి ఇల్లు కుప్పకూలి మ రో ఇంటిపై పడింది. కుప్పకూలిన ఇంట్లో నిరుపేద కుటుంబానికి చెందిన గొర్రెల శ్రీనివాస్ కుటుంబీకులు నలుగురు నివాసం ఉంటున్నారు. శ్రీనివాస్ ఇల్లు కుప్పకూలి ప్రక్కన ఉన్న కనకరాజు ఇంటిపై పడటంతో శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీశారు. ఇల్లు కూలిపోవడంతో నిరాశ్రయులయ్యామని ఉంటానికి గూడు లేదని ప్రభుత్వం ఆదుకోవాలని గొర్రెల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు కోరుతున్నారు.